# దీపిక

కేతు విశ్వనాథరెడ్డి

***

నా అరవై యేళ్ళ జీవితంలో నా శక్తి మేరకు సౌందర్యాన్ని ఆరాధించాను. లోకంలో మంచితనాన్ని నమ్మేను. సృష్టిలో తీయనిది స్నేహమేనోయి అని విశ్వాసిగా జీవించేను.

అందమైన సాయంకాలాలంటే నాకెంతో యిష్టం. యౌవన సౌందర్యాన్ని గుర్తుకుతెచ్చే పూలంటే నాకు ప్రాణం. ప్రకృతిలోని యింకా యింకా యెన్నో నన్ను యిప్పటికీ పరవశింప చేస్తాయి. మనుషుల్లోని మంచితనంపట్ల నాకు అపారమైన విశ్వాసం వుంది. స్నేహమంటే యిప్పటికీ పడిఛస్తాను.

తాలూకా ఆఫీసులో నా యిరవయ్యో యేట అటెండరుగాచేరి, రిటైరయ్యే నాటికి డిప్యూటీ తాసిల్దారు కాగలిగేను. అటెండరుగా వున్నా నా భార్యకు రోజూ పూలు తీసుకొని వెళ్ళేవాడ్ని. డిప్యూటీ తాసిల్దారుగా వున్నప్పుడుకూడా నా భార్య పూ్యన్లతో యేనాడూ పూలు తెప్పించుకొని యెరగదు. ఆమె చాలా అందమైంది.

నా వుద్యోగ జీవితంలో యేనాడూ నేను లంచం ముట్టలేదు. ఒక కూతురు కలిగి ఆ తర్వాత మాకు పిల్లలు కలగక పోవటంవల్ల నా సంపాదన మాకు సరిపోయేది. అంతో యింతో మిగిలేది. స్నేహితులకు చేబదుళ్లు యిచ్చేవాడ్ని. నాదగ్గరకు వచ్చిన రైతులకు నా చేతనైన సాయం చేసేవాణ్ణి. వచ్చే పోయే స్నేహితులతో మాయిల్లు కళకళలాడు తుండేది.

పదేళ్ళ క్రితం మా తాసిల్దారుగారు నేను వద్దని మొత్తుకుంటున్నా, తనతో

పాటు, మరికొందరు మిత్రులతోపాటు నాకూ గవర్నమెంటు బంజరును ఐదెకరాలు నా భార్య పేరున తీయించేడు.

ఈ అయిదెకరాలు నా దశను మార్చి వేశాయి.అయినా నానమ్మకాలుమారలేదు.

టౌను వున్నట్లుండి పెరదయింది. నా భార్య పేరునవున్న నేల గిరాకీ పెరిగింది. దురాశకు పోకుండా యిళ్ళ ప్లాట్లుచేసి అమ్మివేశాను, లక్ష రూపాయలు పైన్నే వచ్చింది. మా టౌనుకు కాస్తా దగ్గర వుండే పల్లెలో అందమైన యిల్లు ఒకటి కట్టుకున్నాను. కాంపవుంటులో రకరకాల పూలమొక్కలు, పండ్లచెట్లు పెంచేను.

ఆశ్చర్య మేమంటే అప్పటినుంచే యిన్నాళ్ళూ పరిమితంగా వున్న నా సౌంధర్య దాహం పెరగడం మొదలు పెట్టింది. ఆపల్లెలోనే నేల తీసుకున్నాను. గంగన్న అని ఒక రైతుమిత్రుని తోడ్పాటుతో బావి తవ్వించేను. మోటారు పెట్టించేను. మానేల రూపు మారిపోయింది. చింతలతోపు చెరుకు తోటగా మారింది; దిద్ది తీర్చిన వరిమళ్ళుగా మారింది. రైతు లందరితో మంచిగా, స్నేహపాత్రునిగా ఉంటూ వాళ్ళ అవసరాలకు వడ్డీకి ఇస్తూ సాయపడుతున్నాను. నానేల మరింత విస్తారమై, బాగాపండి సాటిమనుషులకు సాయపడే శక్తిని పెంచుకోవాలనే కోరిక కూడా యిటీవల యెక్కువై పోయింది.

ఇలాంటి నాకు ప్రకృతిలో అంద విహీనతను, లోకంలో కుళ్ళును మాత్రమే పట్టించుకునే వాళ్ళంటే యెలా సరిపోతుంది? అయినా వాళ్ళతో కూడా మంచిగా వుండటం, స్నేహం చేయటం, వాళ్ళను అభిమానించడానికి ప్రయత్నించడం నా అలవాటు.

ఆ అలవాటు వల్లనే సోమశేఖరాన్ని యిన్నాళ్ళూ భరించేను. బహుశా సోమశేఖరాన్ని భరించినట్లు నా జీవితంలో యెవరినీ భరించలేదు. అలాటి విపరీతమైన మనిషి నా కింతవరకు అతను తప్ప తారసిల్లలేదు.

అతనితో మంచిగా వుండటం, అతని స్నేహాన్ని గౌరవించడం వారం దినాల నుంచీ దుర్భరమై పోయింది. సోమశేఖరం అభిప్రాయాలు జ్ఞాపకం చేసుకుంటే నా తల తిరిగిపోతుంది. అతని అభిప్రాయాల వెనుక వున్న సిద్ధాంతాలను ఆలోచిస్తే నాకు పీడకలలు వస్తున్నాయి.

సోమశేఖరం మా పక్కింటి రైతు కొడుకు. ఎం. ఎ. చేసి ఖాళీగా వుంటున్నాడు. ఈ రోజుల్లో వుద్యోగాలు సులభంగా రావుకదా! అతని చదువు, మర్యాదా నాకు నచ్చేయి. అమెరికాలో వున్న నా మనుమడు అతనిలో కన్పించేడు. వయసును పటించుకోకుండా స్నేహం చేశాను.

ప్రతిరోజు సాయంత్రం పల్లెరోడ్డంట షికారు వెళ్ళేవాళ్ళం. షికారు సమయంలో సౌందర్యం, మంచితనం, స్నేహం వీటిని గురించి చర్చించేవాణ్ణి. జీవితంలో డబ్బువున్నా లేకపోయినావీటికి నిత్యజీవితంలో సానం ఇచ్చేవాడే మనిషి అని చెప్పేవాణ్ణి, నా జీవితాన్ని ఉదహరించేవాణ్ణి. అంతా వింటూ నే నెంతో అమాయకపు పక్షినైనట్లు నావైపు ఒక తమాషాచూపు చూశేవాడు.

అంతెందుకు? మాకిద్దరికి స్నేహమయిన రోజే పల్లె రోడ్డంట షికారు

వెళ్తున్నాం. రోడ్డుకు యిరువేపులా విరగ బూసిన పువ్వుల్ని నేను చూస్తున్నాను. సాయంకాలపు గాలి చల్లదనాన్ని అనుభవిస్తునాను. పడమటి కొండల వెనుక కెంపుల్ని ఆనందిస్తున్నాను. సోమశేఖరం రోడ్డు మధ్య అక్కడక్కడా పడిన ముళ్ళ కంపల్ని యేరి రోడ్డు పక్క విసిరేస్తున్నాడు. అవి పూల చెట్ల మీద పడుతున్నాయి. దారిలో నుంచీ ముళ్ళకంపల్ని తొలగించడం మంచితనమే కావచ్చు. పూల మీద పడేట్లు విసరటం యేమిటి- అతని సౌందర్య ఘాతుకత్వంకాకపోతే?

మరొక రోజు సాయంత్రం పొద్దుగడిచేక మానేల పరిసరాల్లో రోడ్డుకు ఎడమ పక్క ఉండే రావి చెట్టు కింద అరుగు మీద కూచున్నాం.

రావి చెట్టు ఆకుల సందుల్లోంచి చెదిరిన మసక వెన్నెల ముగ్గులు మా చుట్టూ రోడ్డుకు అటు వేపు వెన్నెల్లో గాలికి నెమ్మదిగా తలూస్తున్న పరువంలోని వరి పైరు. ఇటువేపు నవనవలాడుతూ ఎదిగి వస్తున్న చెరుకు తోట; అల్లంత దూరంలోని మా చింత చెట్లల్లోంచి కీచురాళ్ళ శబ్దం. గాలికి యెగిరిపోయే పూలలాగా రోడ్డు కటువేపు పొదలపైన యెగురుతున్న మిణగురులు. ఆకాశంలో అందినంత మేరకు వెలుతుర్లను ఎగరేమిమ్మ, కాంతివంతం చేస్తున్న మైలు దూరంలోని కరెంటు సబ్ స్టేషన్; మళ్ళపక్క కాలువల్లో మెల్లిగాపారుతున్న నీటి సంగీతం; నీళ్ళెక్కించిన పైరులేని మళ్ళల్లోకప్పల బెకబెక....

"యీ వాతావరణం చాలా బాగుంది" అన్న సోమశేఖరం మాట విని వులిక్కిపడ్డాను- అతనేనా ఈ మాట అంది అని. అతని వేపు చూశాను

"కరెంటు, నీళ్ళు సమృద్ధిగా వుంటే యెటు చూసినా పచ్చదనమే" అని సోమశేఖరం ప్రవక్తలా అన్నాడు. మాట్లాడదామని నోరు తెరచే వేళకు-

"గంగన్న చెరకు తోట చాలా బాగుంది. ఈసారైనా అతని కష్టాలుతీరుతాయో లేదో!" అని సోమశేఖరం ముచ్చటగా మూడవ పలుకు పలికి తరువాత మాట్లాడలేదు.

ఈ మూడు మాటల వెనుక నన్ను సోమశేఖరంగానీ మెచ్చుకున్నాడేమో అని ఆలోచించేను. నా వల్లనే అక్కడి నేల సాగుకు వచ్చింది. నా వల్లనే ఆ వూరికి కరెంటు వచ్చింది నేలల్లో నీళ్ళు జలజలా నా వల్లనే పారేయి. పారుతున్నాయి వూరి పచ్చదనం నా వల్లనే. గంగన్న చెరుకుతోట బాగుండటం నా వల్లనే. నేలను కొనటంలో, సాగుకు తీసుకొని రావడంలో గంగన్న నాకెంతో సాయపడ్డాడు. నా మంచి తనం కొద్ది నా నేల పక్కనే వున్న గంగన్న అయిదుకుంటల నేలను సాగుకు తెచ్చుకోడానికి అప్పు యిచ్చేను. బావిలేకపోతే మా బావినుంచే మా మోటారు ద్వారా నీళ్ళు బాడుగుకు యిస్తున్నాను.

సోమశేఖరం నన్నే మెచ్చుకున్నాడని రూఢిగా అనుకున్నా.

ఆ తర్వాత పది రోజులపాటు మేమిద్దరం కలవలేకపోయాము. మా కూతురూ అల్లుడూ, వాళ్ళ పిల్లలూ వచ్చేరు. ఈ హడావిడికి తోడు గంగన్న పంచాయితీ

తెగే వేళకు ఏడెనిమిది రోజులు పట్టింది.

గంగన్న కొడుక్కూ, గంగన్నకూ పడలేదు. నా దగ్గరకు పంచాయితీ కోసం వచ్చేరు. ఆస్తి వున్నదంతా అయిదు కుంటలు. నాకు రావలసిన బాకీ చెల్లు పోను తా మిద్దరికీ మిగిలేదేముంది అంటాడు గంగన్న మిగిలిందే యివ్వ మంటాడు గంగన్న కొడుకు. మాఅల్లుడు మధ్యస్థం చేశాడు భూమి నాకు అమ్మ డమే మేలని వాళ్ళిద్దరికీ నచ్చచెప్పేడు. నాకు రావలసిన బాకీ పోను వాళ్ళిద్దరికీ చెరొక వెయ్యి రూయపాలు యిచ్చి తగాదా పైసలు చేశేను. నిజానికి వూళ్ళో వున్న పరిస్థితుల్లో, ధరల్లో, వడ్డీ రేట్లలో అయితే గంగన్నకూ, గంగన్న కొడుక్కూ ఏమీ మిగలదు గంగన్న మీద ఉందే నా స్నేహభావం వల్ల, నా మంచి తనం వల్ల గంగన్నకు న్యాయమే జరిగిం దని నా నమ్మకం.

ఇది జరిగేక మరుసటి రోజను కుంటాను.

ఆ వేళ ఉదయం సోమశేఖరాన్ని కల వటం పడింది.

మా తోట దగ్గిర చింతచెట్టు కింద మంచంలో కూచునివున్నా! ఆ చోటు అంటే నాకెంతో యిష్టం కూడా. రెండు వందల గజాల ఆవరణ. చుట్టూ పెద్ద పెద్ద చింతచెట్లు- విరగ కాసిన చింత కాయల్తో. వాటి మధ్య మా చెరకుగానుగ చుట్టూ మా నేల- చెరకు తోటల్తో,మిరప తోటలతో, గంగన్న నేల కలవడంతో మరింత బాగుంది.

గెనిమల మీద వూరి వేపు వెళుతూ సోమశేఖరం కన్పించేడు. కేకవేశాను. సోమశేఖరం నా వద్దకు వచ్చేడు. కూచో మన్నాను. మంచం మీద నాపక్క కూచో కుండా యెదురుగా చెరకు పిప్పి గుట్ట మీద కూచున్నాడు. అతనికి యేకోశానా సౌందర్య దృష్టి లేదని రూఢి అవు తోంది.

ఈ పది రోజులుగా నేను పడ్డ అవ స్థలు వివరించేను. మౌనంగా విని చిరు నవ్వు నవ్వేడు.

"చెరకు పాలు తాగుదామా ఒకటి రెండు మిరపకాయలు వేసుకొని. చిరు కారంగా బలే వుంటాయి" అన్నాను.

"అవును మంచితనంలో చెడ్డలా, స్నేహంలో స్వార్థంలా బలే వుంటాయి" అని సోమశేఖరం అన్నాడు. అతని హాస్యోక్తి నాకు అర్థం కాలేదు ఏదో మనసులో గుచ్చుకున్నట్లు అయింది.నవ్వ లేకపోయాను.

వెట్టివాన్ని ఒకడ్ని కేకవేసి మూడు నాలుగు మంచి చెరుకు గెడలు గంగన్న తోటలోవి తెమ్మన్నా. అలాగే మా మిరప తోటలో నాలుగు మిరప కాయలు తీసుకొని రమ్మన్నా. వెట్టివానితో "గంగన్న తోట" అని అప్రయత్నంగా అన్నందుకు మనసు బాధపడింది. అది నా పరమైంది కదా! బహూశా గంగన్నపట్ల నాకుందే స్నేహాభి మానం కొద్దీ నా హృదయం అలాస్పం దించిందేమో అనుకున్నాను.

బాగా బలిసినిటారుగా పెరిగిన నాలుగు చెరుకు గెడల్ని తెచ్చి పెట్టి మొదళ్ళు,

కొసబు నరికి అక్కడ వుంచేడు.

నేనే స్వయంగా మోటార్ ఆడించి చెరకుగెడల్ని, రెండు మూడు మిరపకాయల్ని గానుగ రోలర్ల మధ్యదూర్చిపాలు పట్టేను. ఆదృశ్యాన్ని సోమశేఖరం తదేకంగా చూడ్డం చూసి నాలోనేను నవ్వుకున్నాను, అతనిలో యేదో వైపరీత్యం వుంది అనుకుంటూ.

స్వచ్ఛమైన తెల్లటి మల్లు గుడ్డలో చెరకుపాలు వడబోసి ఒకగ్లాసు సోమశేఖరానికి అందించేను.

"మీరు తాగండి" అన్నాడు.

"తాగవోయ్"అని బలవంతంచేశాను.

గ్లాసు తీసుకున్నాడు.

"మొత్తం యీ అరవై కుంటల నేలకు చుట్టూ కాంపౌండ్ కట్టి నందన వనంగా మార్చాలని వుందోయ్,గంగన్న నేల తీసుకోవటంతో మాది మంచి చతుర ప్రాకారపు తోట అవుతుంది. అయిదు కుంటల్లో కొబ్బరిచెట్లు నాటుతాను. రెండు కుంటల్లో రకరకాల పూలచెట్లను.... వీటి మధ్య మిత్రులతో ...." అంటూ వుల్లాసంగా చెప్పబోతున్నాను.

సోమశేఖరం తాగుతున్న గ్లాసు కింద ఉంచి "దాని కోసమే కదా గంగన్న నేలను వశం చేసుకున్నారు" అన్నాడు.

వశం చేసుకోవడమేమిటి? ఆమాటలు నాకు బొత్తిగా నచ్చలేదు.

అయిదు కుంటల నేల కొనుగోలు విషయంలో నేను గంగన్నపట్ల చూపిన మంచితనం, స్నేహభావం వివరంగా చెప్పేను.

అంతా విని "మీ సౌందర్యదాహం, మంచితనం, స్నేహం సంగతేమో నాకు తెలియదు. కరెంటూ, నీళ్ళూ, డబ్బూ మీ చేతుల్లోవున్నాయి.వుండబట్టే గంగన్న కుటుంబం వీధుల్లో పడింది. మీ దెబ్బతో యింకా కొన్నాళ్ళు పోతే చాలా కుటుంబాలు వీధిన పడతాయి." అని సోమశేఖరం లేచి వెళ్ళిపోయేడు.

నేను తాగుతున్న చెరకుపాలు మరీ కారంగా ఉన్నాయి. ఆమాటతో నా తల తిరిగిపోయింది. సోమశేఖరం దృష్టి యేమిటో తను యే రకం విలువల్ని నమ్ముతున్నాడో ఆలోచిస్తే భయం వేస్తోంది.

గంగన్న కుటుంబాన్ని నేను వీధుల్లో పడేశానా? వాళ్ళోఅందర్నీ వీధుల్లో పడేస్తానా? యెందుకోసం? దప్పిక యెక్కువయింది.

చెరుకు పాలు కారం!

ఇటీవల రాత్రిళ్ళు వొకే పీడకలలు. కరెంటూ, నీళ్ళూ, డబ్బూ నన్ను వేదిస్తున్నాయి.

నిన్నరాత్రి కలలో! కరెంటు పట్టుకొని గంగన్న లబోదిబో మంటున్నాడు. నీళ్ళల్లో గంగన్న కొడుకు. డబ్బురాసుల మధ్య నేనూ, మా అమ్మాయి, అల్లుడు, వాళ్ళపిల్లలు, మా చెరుక గానుగను నేను ఆడిస్తున్నాను. చెరుకులు మనుషులుగా మారిపోతున్నారు. గానుగలోంచీ చెరుకు పాలు కాదు.... రక్తం! అదేమిటీనాలుక పిడచ గట్టుక పోతూంది. దప్పిక .... దప్పిక ....సోమశేఖరం నా గుండెలమీద! అమ్మో గుండె దడ....వూరు వూరంతా నా గుండెమీద!

●